
ప్రజాశక్తి
సోమవారం 8 జనవరి 2024
5
విజయనగరం



వైసిపిలో ముదిరిన గ్రూపుల పోరు

ఎమ్మెల్యేపై వై.వి.సుబ్బారెడ్డికి ఫిర్యాదు

ప్రజాశక్తి-శృంగవరపుకోట

శృంగవరపుకోట నియోజకవర్గంలో వైసిపిలో గ్రూపుల పోరు ముదిరి పాకాన పడింది. ఎమ్మెల్యే కడుబండి శ్రీనివాసరావు తమకు ప్రాధాన్యత ఇవ్వడం లేదంటూ నియోజకవర్గంలోని పలువురు సర్పంచులు, ఎంపిటిసిలు, నాయకులు, కార్యకర్తలు ఆదివారం విశాఖపట్నంలో వైసిపి ఉత్తరాంధ్ర కోఆర్డినేటర్ వై.వి.సుబ్బారెడ్డికి ఫిర్యాదుచేశారు. ఈ సందర్భంగా శృంగవరపుకోట జెడ్పిటిసి వెంకటలక్ష్మి మాట్లాడుతూ నియోజకవర్గంలో ఎమ్మెల్యే మహిళలను పట్టించుకోవడం లేదన్నారు. ఎమ్మెల్యే తీరు మారకుంటే రానున్న ఎన్నికల్లో వైసిపికి పరాభవం తప్పదని చెప్పారు.

ఉపాధికి ఆధార్ తిప్పలు



ఆందోళనలో కూలీలు

ప్రజాశక్తి - విజయనగరం ప్రతినిధి

జాతీయ ఉపాధి హామీ చట్టం ద్వారా కూలీల వేతనాల చెల్లింపునకు కేంద్ర ప్రభుత్వం ఆధార్ బేస్డ్ పేమెంట్ సిస్టమ్ అమలు చేస్తోంది. ఈ నెల ఒకటో తేదీ నుంచీ ఈ విధానం అమల్లోకి వచ్చింది. దీంతో ఎలాంటి ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వస్తుందో.. అంటూ కూలీలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. విజయనగరం జిల్లాలో 3.51 లక్షల మందికి ఉపాధి జాబ్ కార్డులు ఉన్నాయి. ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో ఇప్పటి వరకు 1.61 కోట్ల పనిదినాలు కల్పించినట్టు అధికారులు లెక్కలు చూపుతున్నారు. ఈ లెక్కన పనిదినాలు 107.27 శాతంగా నమోదయ్యాయి. అటు పార్వతీపురం మన్యం జిల్లాలో 2.07 లక్షల జాబ్‌కార్డులు ఉండగా 3.95 లక్షల మంది పనులు చేస్తున్నారు. రోజువారీగా పనులకు హాజరౌతున్న వారి సంఖ్య 1.91లక్షల వరకు ఉంది. ఇరు జిల్లాల్లోనూ ఏటా వందల కోట్ల రూపాయలు ఉపాధి కూలీలకు జమ అవుతున్నాయి. దీంతో ప్రకృతి వైపరీత్యాలు, లేదా ఇతర ఇబ్బందులు ఎదురైనా ఉపాధి కూలి డబ్బులతో బతుకీడుస్తున్నారు. దీన్నిబట్టి విజయనగరం, పార్వతీపురం మన్యం జిల్లాల్లో ఉపాధి హామీ పనుల అవసరం, ఆవశ్యకత ఎంత ఉందో వేరేగా చెప్పనక్కర్లేదు. తాజాగా జాబ్‌కార్డుకు ఆధార్ అనుసంధానం చేయాలన్న నిబంధన తప్పనిసరి చేయడంతో ఎలాంటి చిక్కులు వస్తాయో అన్న ఆందోళన కూలీల నుంచి వినిపిస్తోంది. ప్రస్తుతం కూలీలందరికీ బ్యాంకు ఖాతాల ద్వారానే కూలి సొమ్ము అందుతోంది. బ్యాంకర్లు కూడా ఆధార్ ఉంటే తప్ప ఖాతాలు ఇచ్చే పరిస్థితి లేదు. ఇటువంటి పరిస్థితుల్లో జాబ్‌కార్డుకు కూడా ఆధార్ అనుసంధానం తప్పనిసరి చేయడం వెనుక ఆంతర్యం ఏమిటి అనేది ప్రశ్న.

త్వరలో ముఖ ఆధారిత హాజరు అమలుకు కూడా కేంద్ర ప్రభుత్వం సిద్ధమౌతోంది. ఈనేపథ్యంలో ఉపాధిలో కోత విధించేందుకే ఇటువంటి విధానాలు అమలు చేస్తోందన్న అనుమానాలు వ్యక్తమౌతున్నాయి. ఇప్పటికే ఉపాధి పనులను ఒక పూటకు బదులు రెండు పూటలు చేయాలని నిబంధన పెట్టడం, వేసవి అలవెన్సులు, పార, గునపాం, గమెలాలు వంటి పనిముట్లకు చెల్లించే డబ్బులు రద్దుచేయడం వంటి విధానాలు అమలు చేస్తున్న సంగతి తెలిసిందే. మరోవైపు ఏడాదికి 200రోజులు పని కల్పించాలని కూలీలు డిమాండ్ చేస్తున్నారు. ఈనేపథ్యంలో అసలుకే ఎసరుపెట్టి, ఉపాధి నిధుల్లో మరింత కోత విధించేందుకు సన్నాహాలు జరుగుతున్నాయా? అన్న సందేహాలు వ్యక్తమౌతున్నాయి. ఇక అసలు విషయానికి వస్తే జాబ్‌కార్డుకు ఆధార్ అనుసంధానం చేయడం విజయనగరం జిల్లాలో 99శాతం పూర్తిచేసినట్టు అధికారులు చెప్తుండగా, పార్వతీపురం మన్యం జిల్లాలో ఆధార్ కార్డు లేని గిరిజనులు చాలా ఎక్కువ మంది ఉన్నట్టుగా తెలుస్తోంది. ఈ నేపథ్యంలో వీరికి కూలి సొమ్ము ఎలా చెల్లిస్తారో అని పలువురు వ్యాఖ్యానిస్తున్నారు. ప్రస్తుతం ఉపాధి పనులు పెద్దగా జరగడం లేదు. సంక్రాంతి పండగ వెళ్లాక రెండు జిల్లాల్లోనూ పనులు ముమ్మరంగా సాగుతాయి. పేమెంట్లు చెల్లింపుల్లో ఆధార్ లింకు అసలు రంగు బయటపడుతుందని పలువురు వ్యాఖ్యానిస్తున్నారు.

ఎస్మాకు బెదరం

- ఎక్కడికక్కడ జిఒ కాపీలు దహనం
- 27వ రోజుకు నిరవధిక సమ్మె
- అంగన్వాడీలకు పెరుగుతున్న మద్దతు



గంట్యాడ.. జిఒ కాపీలను దహనం చేస్తున్న అంగన్వాడీలు

ప్రజాశక్తి- శృంగవరపుకోట

అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ ఆధ్వర్యాన చేపట్టిన నిరవధిక సమ్మెను విచ్చిన్నం చేసేందుకు ప్రభుత్వం తీసుకొచ్చిన ఎస్మా చట్టానికి ఎట్టి పరిస్థితుల్లోనూ బెదరబోమని అంగన్వాడీలు తెగేసి చెప్పారు. తమ డిమాండ్లన్నీ ప్రభుత్వం నెరవేర్చే వరకూ సమ్మె కొనసాగుతుందని స్పష్టంచేశారు. అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ ఆధ్వర్యాన జిల్లాలో చేపట్టిన నిరవధిక సమ్మె ఆదివారం 27వ రోజుకు చేరింది. శృంగవరపుకోట పట్టణంలో ఎస్మా చట్టం జిఒ కాపీలను అంగన్వాడీలు దహనం చేశారు. కార్యక్రమంలో సిఐటియు జిల్లా కార్యదర్శి మద్దిల రమణ, అంగన్వాడీ యూనియన్ నాయకులు డి.శ్యామల, భారతి, వి.హేమ, డి.జగదీశ్వరి, వి.మాణిక్యం, సుశీల, రమణి పాల్గొన్నారు.

విజయనగరం టౌన్ : అంగన్వాడీల సమ్మెలో భాగంగా కలెక్టరేట్ ఎదుట చేపట్టిన రిలే నిరాహార దీక్షలు ఆదివారం రెండో రోజుకు చేరాయి. ఈ దీక్షలకు ఇన్సూరెన్స్ యూనియన్ నాయకులు ఎం.శ్రీనివాస, పట్టణ పౌర సంక్షేమ సంఘం జిల్లా కార్యదర్శి రెడ్డి శంకరరావు, ఐద్వా జిల్లా కార్యదర్శి పి.రమణమ్మ మద్దతు తెలిపి, మాట్లాడారు. సిఐటియు నాయకులు బి రమణ, అంగన్వాడీ యూనియన్ జిల్లా అధ్యక్షులు బి పైడిరాజు పాల్గొన్నారు.

గజపతినగరం : గజపతినగరంలోని సమ్మె శిబిరంలో వినూత్నరీతిలో అంగన్వాడీలు నిరసన తెలిపారు. గ్రామదేవత వేషధారణలో ఉన్న వ్యక్తిని తమ కోర్కెలను సిఎం జగన్మోహన్ రెడ్డి తీరుస్తారా? లేదా? అంటూ నిరసన తెలిపారు. కార్యక్రమంలో సిఐటియు ఉపాధ్యక్షులు వి.లక్ష్మి, అంగన్వాడీ యూనియన్ ప్రాజెక్టు అధ్యక్షులు ఎం.సుభాషిని, జి.సన్యాసమ్మ, రవణమ్మ, సుజాత తదితరులు పాల్గొన్నారు.

కొత్తవలస : కొత్తవలస జంక్షన్‌లో అంగన్వాడీలు రాస్తారోకో చేపట్టారు. అనంతరం జిఒ 2 కాపీలను దహనం చేశారు. కార్యక్రమంలో అంగన్వాడీ యూనియన్ నాయకులు కాకర తులసి, సిఐటియు నాయకులు గాడి అప్పారావు పాల్గొన్నారు.



జామి.. ఎస్మా చట్టం జిఒ కాపీలను దహనం చేస్తున్న అంగన్వాడీలు

చీపురుపల్లి : చీపురుపల్లిలో అంగన్వాడీలు భారీ ర్యాలీ చేపట్టారు. అనంతరం నాలుగు రోడ్ల కూడలిలో మానవహారం నిర్వహించి, ఎస్మా చట్టం జిఒ కాపీలను దహనం చేశారు. మానవహారానికి అనుమతి లేదని పోలీసులు అడ్డుచెప్పారు. దీంతో పోలీసులకు, అంగన్వాడీలకు మధ్య వాగ్వివాదం చోటుచేసుకుంది. ఈ కార్యక్రమంలో సిఐటియు రాష్ట్ర నాయకులు టివి రమణ, జిల్లా నాయకులు కిల్లంపల్లి రామారావు, అంగన్‌వాడీ యూనియన్ జిల్లా నాయకులు వరలక్ష్మి, ప్రాజెక్టు అధ్యక్షులు బలగ నాగమణి, కార్యదర్శి మాలతి, తదితరులు పాల్గొన్నారు.

గంట్యాడ : గంట్యాడలో అంగన్వాడీలు ఎస్మా చట్టం అమలు జిఒ కాపీలను దహనం చేసి, నిరసన తెలిపారు.

జామి : జామి తహాశీల్దార్ కార్యాలయం ఎదుట ఎస్మా జిఒ కాపీలను అంగన్వాడీలు దహనం చేశారు. కార్యక్రమంలో సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి కె.సురేష్, నాయకులు గాడి అప్పారావు, అంగన్వాడీ యూనియన్ నాయకులు కృష్ణమ్మ పాల్గొన్నారు.



కొత్తవలస.. రాస్తారోకో చేస్తున్న అంగన్వాడీలు



చీపురుపల్లిలో మానవహారం చేస్తున్న అంగన్వాడీలు



విజయనగరంలో దీక్షా శిబిరాన్ని ఉద్దేశించి మాట్లాడుతున్న ఎం.శ్రీనివాస

ఎన్‌ఎపిటిఎ రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా వేణుగోపాలరావు

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

న్యూ ఆంధ్రప్రదేశ్ తైక్వాండో అసోసియేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా జిల్లాకు చెందిన సిహెచ్.వేణుగోపాలరావు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. విశాఖపట్నంలోని లయన్స్ క్లబ్ వేదికగా అసోసియేషన్ రాష్ట్ర విస్తృత స్థాయి సమావేశం జరిగింది. అనంతరం నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. వేణుగోపాలరావుకు జిల్లా ఒలింపిక్ అసోసియేషన్ అధ్యక్షులు గురాన అయ్యలు, క్రీడా సంఘాలు ప్రతినిధులు, క్రీడాభిమానులు అభినందనలు తెలిపారు.

13న రంగోలీ పోటీలు

ప్రజాశక్తి-విజయనగరం కోట

ఈ నెల 13న వాజీ చానల్ ఆధ్వర్యాన రంగోలీ పోటీలు నిర్వహిస్తున్నట్లు క్వీన్స్ ఎన్ఆర్ఐ ఆసుపత్రి డైరెక్టర్ డి.రమేష్‌కుమార్ తెలిపారు. ఆదివారం ఆసుపత్రి ప్రాంగణంలో రంగోలీ పోటీల వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వాజీ చానల్ ఆధ్వర్యాన 28 ఏళ్లుగా రంగోలీ పోటీలు నిర్వహించడం అభినందనీయమన్నారు. సుమారు 1200 మంది రంగోలీ పోటీలకు హాజరుకానున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో మధు, కెఆర్‌కె రాజు, కిశోర్ తదితరులు పాల్గొన్నారు.

డోలిమోత.. కడుపుకోత

- గిరిశిఖర గ్రామాలకు ప్రాణసంకటంగా మారిన రహదారి సమస్య
- సకాలంలో అందని వైద్య సేవలు
- డోలి కట్టి తీసుకొచ్చిన చంటిబిడ్డ మృతి

గిరిశిఖర గ్రామాల్లో డోలిమోతలు నిత్యకృత్యమయ్యాయి. ప్రభుత్వాలు మారినా గిరిజనుల బతుకులు మారడం లేదు. నేటికీ రహదారి సౌకర్యానికి నోచుకోకపోవడమే అందుకు కారణం. రోగాల బారిన పడిన గిరిశిఖర గ్రామాల ప్రజలు ఆస్పత్రులకు వెళ్లడం సాహసమే అవుతోంది. కిలోమీటర్ల మేర నడిచి వెళ్లడమో.. లేదంటే డోలికట్టి మోసుకెళ్లడమో నిత్యకృత్యమవుతోంది. అనారోగ్యానికి గురైన, నెలలు నిండిన గర్భిణులకు డోలీ మోతే శరణ్యమవుతోంది. ఇలాంటి పరిస్థితుల్లో ప్రాణాలు పోయిన సందర్భాలూ ఉన్నాయి. తాజాగా అలాంటి విషాదకర సంఘటనే చోటుచేసుకుంది. అత్యవసర వైద్యం అందక ఓ చంటిబిడ్డ మృతిచెందింది.



మృతిచెందిన చంటిబిడ్డ

ప్రజాశక్తి-శృంగవరపుకోట

మండలంలో మూలబొడ్డవర పంచాయతీ పరిధిలోని చిట్టెంపాడు.. గిరిశిఖర గ్రామం. ఆ గ్రామానికి చెందిన మాదల గంగమ్మ, ఆమె చంటి బిడ్డకు శుక్రవారం తీవ్ర అనారోగ్యం కావడంతో భర్త గంగులు తోటి గిరిజనుల సహాయంతో వారిని డోలిపై వైద్యం కోసం పట్టణంలోని ఏరియా ఆసుపత్రికి తీసుకొచ్చారు. ఆస్పత్రి వైద్యులు తమ వద్ద సరైన వైద్య సౌకర్యాలు లేవంటూ ఎప్పటిలాగే విశాఖలోని కెజిహెచ్‌కు తల్లీ బిడ్డను రిఫర్ చేశారు. కెజిహెచ్‌లో చికిత్స పొందుతూ పరిస్థితి విషమించి శనివారం రాత్రి చంటిబిడ్డ ప్రాణం గాల్లో కలిసిపోయింది.

గిరిశిఖర గ్రామమైన చిట్టెంపాడు నుంచి కొండ దిగువకు తల్లీ బిడ్డను ఏడు కిలోమీటర్ల మేర డోలిపై తీసుకొచ్చారు. అక్కడ నుంచి స్థానిక ఏరియా ఆసుపత్రికి తీసుకొచ్చినా, సరైన చికిత్స అందలేదు. దీంతో విశాఖ కెజిహెచ్‌కు తరలించి, అక్కడ వారికి వైద్యం అందించే సరికి జరగాల్సిన నష్టం జరిగిపోయింది. అప్పటికే ఆలస్యం కావడంతో చంటిబిడ్డ మరణించింది. దీంతో చిట్టెంపాడు గ్రామంలో విషాదఛాయలు అలముకున్నాయి. మండలంలోని గిరిశిఖర గ్రామాలకు రహదారి సౌకర్యాలు కల్పించకపోవడంతో గిరిజనులకు ఏ చిన్న అనారోగ్యం చేసినా డోలిలో వారిని మోసుకుంటూ కిందకు వచ్చేసరికి వారి ప్రాణాలు గాలిలో కలిసిపోవడం నిత్యకృత్యంగా మారుతోంది. గిరిశిఖర గ్రామాలకు రోడ్డు సౌకర్యం కల్పిస్తామని ఎన్నికల సమయంలో హామీలివ్వడమే తప్ప అధికారంలోకి వచ్చాక ఆచరణలో చిత్తశుద్ధిని కనబరచడం లేదు.



డోలికట్టి తల్లీ బిడ్డను తీసుకొస్తున్న గిరిజనులు(ఫైల్)

ఎమ్మెల్సీ హామీనిచ్చినా..

అధికార పార్టీకి చెందిన ఎమ్మెల్సీ రఘురాజు సొంత పంచాయతీ మూలబొడ్డవర పరిధిలోని చిట్టెంపాడు గ్రామానికి రహదారి సౌకర్యం లేదు. దారపర్తి పంచాయతీలోని 12 గిరిజన గ్రామాలదీ అదే పరిస్థితి. రహదారి సౌకర్యాలు లేక, డోలీమోత ద్వారా తీసుకెళ్లే సరికి ఆలస్యమై, సకాలంలో వైద్యం అందక మరణాలు సంభవిస్తున్నాయి. గతంలో ఎన్నో సందర్భాల్లో ఎమ్మెల్సీ రోడ్డు వేస్తానని హామీనిచ్చారు. కళ్లు కాయలు కాసేలా చూసినా ఫలితం లేకుండా పోయింది. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి మూలబొడ్డవర, దారపర్తి పంచాయతీల్లోని గిరిజన గ్రామాలకు రహదారి సౌకర్యం కల్పించాలి.

- జె.గౌరీష్,
ఆదివాసీ గిరిజన సంఘం నాయకులు

సమస్యలు లేని నగరంగా మార్చుతాం

మంత్రి బొత్స సత్యనారాయణ



మాట్లాడుతున్న మంత్రి బొత్స సత్యనారాయణ

విజయనగరంటౌన్ : విజయనగరాన్ని సమస్యలు లేని నగరంగా మార్చుతామని మంత్రి బొత్స సత్యనారాయణ తెలిపారు. డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి నగరాన్ని రాజీ పడకుండా అభివృద్ధి చేశారని కొనియాడారు. ఆదివారం ధర్మపురి లో 30, 31 డివిజన్ల పరిధిలో రూ.2 కోట్ల అంచనా విలువతో, కె.ఎల్‌పురం 45, 47 డివిజన్ల పరిధిలో రూ. 1.60 కోట్ల అంచనా విలువతో నిర్మించిన వాటర్ ట్యాంకులను డిప్యూటీ స్పీకర్ కోలగట్లతో కలసి మంత్రి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అమృత్ పథకం కింద మరో 60 కోట్లతో ముషిడిపల్లి నుండి విజయనగరం వరకు కొత్త పైప్‌లైన్ వేసి నగరానికి రెండు పూటలా నీరందించడానికి కృషి చేస్తున్నామన్నారు.

కార్యక్రమంలో ఎమ్మెల్సీ సురేష్‌బాబు, మేయర్ విజయలక్ష్మి, డిప్యూటీ మేయర్ కోలగట్ల శ్రావణి, కార్పొరేటర్లు గణపతి, సంతోషి, కమిషనర్ శ్రీరాములు నాయుడు, పబ్లిక్ హెల్త్ ఎస్ఇ గణపతి రావు, ఇఇ దక్షిణా మూర్తి పాల్గొన్నారు.

కొనసాగుతున్న సమగ్ర శిక్ష ఉద్యోగుల సమ్మె

మద్దతు తెలిపిన జనసేన నాయకులు యశస్వి

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

సమగ్ర శిక్షలో పని చేస్తున్న కాంట్రాక్టు, అవుట్ సోర్సింగ్ ఉద్యోగులను రెగ్యులర్ చేయాలని, కనీస వేతనాలు చెల్లించాలని డిమాండ్ చేస్తూ చేపట్టిన సమ్మె ఆదివారం కొనసాగింది. కలెక్టరేట్ ఎదుట చేపట్టిన శిబిరంలో ఉద్యోగులు పాల్గొని నిరసన తెలిపారు. ప్రభుత్వం సమస్యలు పరిష్కరించే వరకూ సమ్మె కొనసాగుతుందని జెఎసి రాష్ట్ర అధ్యక్షులు బి కాంతారావు స్పష్టంచేశారు. ప్రభుత్వం ఉద్యోగులను బెదిరించి సమ్మెను విచ్చిన్నం చేసే ప్రయత్నం చేయడం అన్యాయమన్నారు. హామీలను అమలు చేసే వరకు సమ్మె కొనసాగుతుందని హెచ్చరించారు. సమ్మెకు జనసేన పార్టీ నాయకులు పాలవలస యశస్వి మద్దతు తెలిపారు. ఉద్యోగుల పట్ల నియంతలా వ్యవహరించడం సరికాదన్నారు. వెంటనే మానవతా దృక్పథంతో సమస్యల పరిష్కరించి సమ్మెను విరమింపజేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్‌చేశారు. కార్యక్రమంలో జెఎసి నాయకులు గురువులు, శ్రీనివాసరావు ఉద్యోగులు పాల్గొన్నారు.

13వ రోజుకు మున్సిపల్ కార్మికుల సమ్మె

నేడు కలెక్టరేట్ ముట్టడికి పిలుపు

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

ఎపి మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ ఫెడరేషన్ ఆధ్వర్యాన చేపట్టిన ఆదివారం 13వ రోజుకు చేరింది. స్థానిక కార్పొరేషన్ కార్యాలయం వద్ద ఫెడరేషన్ ఆధ్వర్యాన సమ్మె శిబిరాన్ని కొనసాగించారు. ఈ సందర్భంగా ఫెడరేషన్ రాష్ట్ర కమిటీ సభ్యులు జగన్మోహనరావు, సిఐటియు నగర కార్యదర్శి బి.రమణ, ఫెడరేషన్ కార్యదర్శి భాస్కరరావు మాట్లాడుతూ మున్సిపల్ కార్మికుల సమ్మెపై ప్రభుత్వం మొండివైఖరి వీడటం లేదని ఆగ్రహం వ్యక్తంచేశారు. ఈ నేపథ్యంలో సోమవారం కలెక్టరేట్ ముట్టడి కార్యక్రమం చేపడుతున్నట్లు తెలిపారు. అనంతరం ముట్టడి పోస్టర్‌ను విడుదల చేశారు. కార్యక్రమంలో ఫెడరేషన్ నాయకులు శంకర్రావు, రామారావు, శ్రీను, సూరి, రాఘవ, చిన్ని, మజ్జు, అప్పలరాజు తదితరులు పాల్గొన్నారు.

నెల్లిమర్ల : స్థానిక నగర పంచాయతీ కార్యాలయం వద్ద సిఐటియు ఆధ్వర్యాన నగర పంచాయతీ కార్మికులు ఎస్మా జిఒ కాపీలను దహనం చేశారు. కార్యక్రమంలో సిఐటియు రాష్ట్ర కమిటి సభ్యులు టివి రమణ, జిల్లా నాయకులు కిల్లంపల్లి రామారావు, మున్సిపల్ వర్కర్స్ ఫెడరేషన్ నాయకులు టి.బాబూరావు, బి.హరిబాబు, శ్రీను, రాము, లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.



ఎస్మా చట్టం జిఒ ప్రతులను దహనం చేస్తున్న మున్సిపల్ కార్మికులు

బొబ్బిలి : పట్టణంలోని పాకివీధిలో అంబేద్కర్ విగ్రహం వద్ద ఎస్మా చట్టం జిఒ కాపీలను మున్సి పల్ కార్మికులు దహనం చేసి, నిరసన తెలిపారు. వీరికి సిఐటియు జిల్లా అధ్యక్షులు పి.శంకరరావు మద్దతు ప్రకటించారు. కార్యక్రమంలో ఫెడరేషన్ పట్టణ అధ్యక్షులు జి.గౌరీష్, నాయకులు యుగంధర్, వాసు, కార్మికులు పాల్గొన్నారు.

ఇచ్చిన మాట నిలబెట్టుకోని ప్రభుత్వం

టిడిపి పొలిట్‌బ్యూరో సభ్యులు అశోక్

ప్రజాశక్తి-విజయనగరం కోట

ప్రభుత్వం ఇచ్చిన మాట నిలబెట్టుకోలేదని, అందుకే రాష్ట్ర వ్యాప్తంగా ఆందోళనలు ఎక్కువయ్యాయని టిడిపి పొలిట్‌బ్యూరో సభ్యులు పి.అశోక్‌గజపతిరాజు తెలిపారు. రాష్ట్రం నవ్వుల పాలైందని వ్యాఖ్యానించారు. ఆదివారం స్థానిక అశోక్ బంగ్లాలో టిడిపి నియోజకవర్గ ఇన్‌ఛార్జి అదితి గజపతిరాజు ఆధ్వర్యాన నియోజకవర్గ విస్తృత స్థాయి సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యువగళం పాదయాత్ర సమయంలో రాజ్యాంగ వ్యతిరేకంగా రాష్ట్రంలో నడుస్తున్న విషయాలను తన ఎర్ర పుస్తకంలో నారా లోకేష్ రాసుకుంటున్నామంటే, దానికి రాష్ట్ర ప్రభుత్వం సిబిఐ విచారణ వేయించిందని చెప్పారు. ప్రజా దర్బార్ కూల్చడంతో మొదలైన వైసిపి విధ్వంసకర పాలన జిల్లాలో పవర్ ప్లాంట్‌ను ధ్వంసం చేసే వరకూ వచ్చిందన్నారు. సైకోను ఇంటికి పంపించి, భావితరాలకు ప్రజాస్వామ్యాన్ని అందించాలని కోరారు. బొబ్బిలిలో ఈ నెల పదో తేదిన చంద్రబాబు నిర్వహించే రా.. కదలిరా కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు. సమావేశంలో టిడిపి పరిశీలకులు తోట రత్న, జిల్లా ప్రధాన కార్యదర్శి ఐవిపి రాజు, పట్టణ అధ్యక్షులు ప్రసాదుల లక్ష్మీ వరప్రసాద్, మండల అధ్యక్షులు బొద్దల నర్సింగరావు, కార్యదర్శి గంటా పోలినాయుడు, కార్యాలయ కార్యదర్శి రాజేష్ బాబు పాల్గొన్నారు.

పదో తరగతి పరీక్షలకు విద్యార్థులు సంసిద్ధం

- మెరుగైన ఫలితాల లక్ష్యంగా సాధన
- 'ప్రజాశక్తి'తో డిఇఒ లింగేశ్వరరెడ్డి ముఖాముఖి



ప్రజాశక్తి-విజయనగరం టౌన్

మార్చి నెలలో జరిగే పదో తరగతి పబ్లిక్ పరీక్షల్లో జిల్లా విద్యార్థులు మెరుగైన ఫలితాలు సాధించే దిశగా చర్యలు తీసుకున్నట్లు జిల్లా విద్యాశాఖ అధికారి బి.లింగేశ్వర రెడ్డి తెలిపారు. విద్యార్థులను ఇప్పటికే సన్నద్ధం చేసినట్లు చెప్పారు. ఈవారం తనను కలిసిన 'ప్రజాశక్తి'కి ఆయన ప్రత్యేక ఇంటర్వ్యూ ఇచ్చారు. పదో తరగతి పరీక్షలకు విద్యార్థులను ఎలా సన్నద్ధం చేస్తున్నారు?, ఎటువంటి ప్రణాళిక అమలు చేశారు? వంటి విషయాలను ఆయన వివరించారు. ఆ ఇంటర్వ్యూ వివరాలు...



ఈ ఏడాది పదో తరగతి పరీక్షలకు ఎంత మంది విద్యార్థులు హాజరుకానున్నారు.?

ఈ ఏడాది పదో తరగతి పరీక్షలకు 4442 స్కూళ్ల నుంచి 23,910 మంది రెగ్యులర్ విద్యార్థులు, ప్రయివేటుగా 3394 మంది విద్యార్థులు హాజరుకానున్నారు.

పదో తరగతి సిలబస్ పూర్తి అయ్యిందా.?

పదో తరగతి విద్యార్థులకు పాఠ్యాంశ బోధన అక్టోబర్ నెలతో పూర్తయింది. సిలబస్ పూర్తయ్యాక ప్రత్యేక తరగతులు, స్టడీ అవర్స్ నిర్వహించి విద్యార్థులను సంసిద్ధం చేస్తున్నాం.

ఫలితాల మెరుగుదలకు తీసుకున్న చర్యలు ఏమిటి.?

పదో తరగతిలో గతేడాది కంటే మెరుగైన ఫలితాలు సాధించే లక్ష్యంగా విద్యా సంవత్సరం ప్రారంభం నుంచి ప్రత్యేక శ్రద్ధ పెట్టాం. అందుకనుగుణంగా పాఠ్యాంశ బోధన, విద్యార్థులను చదివించడం చేస్తున్నాం. పూర్తయిన ప్రతి పాఠ్యాంశంపైనా పరీక్ష నిర్వహించి, విద్యార్థులను సంసిద్ధం చేశాం. ప్రతి వారం, నెల వారీ పరీక్షలు నిర్వహించి విద్యార్థులను పబ్లిక్ పరీక్షలే లక్ష్యంగా తీర్చిదిద్దాం.

100 రోజులు ప్రణాళిక ఎలా అమలవుతోంది.?

పదో తరగతి పరీక్షల్లో మెరుగైన ఫలితాలు లక్ష్యంగా, ప్రతి విద్యార్థి ఉత్తీర్ణులయ్యే విధంగా వంద రోజుల ప్రణాళిక అమలు చేస్తున్నాం. అక్టోబర్ నుంచి ఫిబ్రవరి వరకు వంద రోజులు ప్రణాళిక సిద్ధం చేసి అమలు చేస్తున్నాం. ఈ ప్రణాళిక ద్వారా ప్రతి సబ్జెక్ట్ టీచర్‌కి అందులో వెనుకబడి ఉన్న విద్యార్థి బాధ్యత అప్పగించి, మంచి మార్కులు తెచ్చుకునే విధంగా కృషి చేస్తున్నాం.

గతేడాది ఫలితాల్లో జిల్లా వెనుకబడి ఉంది, ఇంకా మెరుగైన ర్యాంకు కోసం తీసుకున్న చర్యలు ఏమిటి.?

ఈ ఏడాది ప్రయివేటు స్కూళ్లతో సమానంగా ఫలితాలు వచ్చే విధంగా ప్రభుత్వ పాఠశాలల విద్యార్థుల పట్ల ప్రత్యేక శ్రద్ధ తీసుకున్నాం. ప్రతి విద్యార్థి కేంద్రంగా చదివిస్తున్నాం. వెనుకబడిన విద్యార్థులకు ఉపాధ్యాయుడిని అటాచ్ చేసి, మంచి మార్కులు తెచ్చుకునేలా ప్రయత్నాలు చేశాం. దీనివల్ల ఈ ఏడాది ఎక్కువ పాఠశాలల్లో వంద శాతం ఫలితాలు వచ్చే అవకాశం ఉంది.

ఈ ఏడాది ఎన్ని కేంద్రాల్లో పరీక్షలు నిర్వహిస్తున్నారు.?

ఈ ఏడాది జిల్లాలో 128 కేంద్రాల్లో పదో తరగతి పబ్లిక్ పరీక్షలు జరగనున్నాయి. ఇప్పటికే పరీక్ష కేంద్రాలను గుర్తించి అన్ని సౌకర్యాలు ఉండేలా చర్యలు తీసుకున్నాం. పరీక్ష కేంద్రాలను పరిశీలించాం. పరీక్షలు ప్రశాంతంగా జరిగేలా జాగ్రత్తలు తీసుకుంటాం.

ప్రయోగాత్మక విద్యతోనే ప్రయోజనం



విజేతలతో జనవిజ్ఞాన వేదిక నాయకులు

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

ప్రయోగాత్మక విద్యతోనే విద్యార్థులకు ప్రయోజనమని జాతీయ స్థాయి సైన్సు రిసోర్సు పర్సన్ డాక్టర్ జోగా చంద్ర శేఖర్ అన్నారు. జన విజ్ఞాన వేదిక ఆధ్వర్యాన నిర్వహిస్తున్న చెకుముకి సంబరాలలో భాగంగా జిల్లా స్థాయిలో స్థానిక మహారాజా సంస్కృత కళాశాలలో ఆదివారం టాలెంట్ టెస్ట్ ఏర్పాటుచేశారు. జట్లలో 103 మంది విద్యార్థులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా భౌతికశాస్త్రంలో మెకానిక్స్ అనే అంశంపై జోగా చంద్రశేఖర్, జెవివి జిల్లా అధ్యక్షులు ఎంవిఎన్ వెంకటరావు అనేక ప్రయోగాలు చేసి చూపించి అందరినీ ఆకట్టుకున్నారు. పోటీల్లో ప్రభుత్వ పాఠశాలల నుండి బొబ్బిలి గురుకుల విద్యార్థులు ప్రథమ స్థానంలో నిలిచారు. తెర్లాం, మరడాం జిల్లా పరిషత్తు ఉన్నత పాఠశాలల విద్యార్థులు ద్వితీయ స్థానంలో నిలిచారు. ప్రయివేట్ పాఠశాలల నుండి ఫోర్ట్ సిటి పాఠశాల, రాజాంలోని సన్ స్కూల్ విద్యార్థులు ప్రథమ, ద్వితీయ స్థానాల్లో నిలిచారు. ప్రథమ స్థానాల్లో నిలిచిన విద్యార్థులు ఫిబ్రవరి రెండో వారంలో చిలకలూరిపేటలో జరిగే రాష్ట్ర స్థాయి చెకుముకి సంబరాలలో జిల్లా తరపున పాల్గొంటారు. కార్యక్రమంలో జన విజ్ఞాన వేదిక రాష్ట్ర ఉపాధ్యక్షులు వి.రాజగోపాల్, సమతా విభాగం కన్వీనర్ జి.నిర్మల, జిల్లా కార్యదర్శి పి.రమణ ప్రభాత్, ఉపాధ్యక్షులు కె.మురళీబాబు, సత్యంనాయుడు, నగర అధ్యక్షులు డాక్టర్ చిన్నారి, కోశాధికారి సి.హెచ్.సింహాచలం పాల్గొన్నారు.

ప్రజాశక్తి
www.prajasakti.com

చంద్రబాబు సభను జయప్రదం చేయండి

చీపురుపల్లి: ఈ నెల పదో తేదీన బొబ్బిలిలో జగరనున్న టిడిపి బహిరంగ సభను జయప్రదం చేయాలని టిడిపి నియోజకవర్గం ఇంఛార్జి కిమిడి నాగార్జున ప్రజలను కోరారు. ఆదివారం ఆయన స్థానిక విలేకురలతో మాట్లాడారు. 10న టిడిపి ఆధ్వర్యంలో జరగనున్న రా కదలి రా అనే సభకి టిడిపి జాతీయ అధ్యక్షుడు చంద్రబాబు హాజరవుతారని అన్నారు. ఈ సభకి పెద్ద సంఖ్యలో పార్టీ శ్రేణులు, ప్రజలు తరలి రావాలని నాగార్జున కోరారు. సమావేశంలో మాజీ ఎమ్మెల్యే బగ్గు రమణ, రాష్ట్ర కార్యదర్శి గొంప కృష్ణ తదితరులున్నారు.

బాడంగి: రా కదలిరా కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని టిడిపి నియోజకవర్గ ఇన్‌ఛార్జి బేబినాయన కోరారు. ఈ మేరకు ఆదివారం బాడంగిలోని టిడిపి కార్యాలయంలో ఆపార్టీ మండల అధ్యక్షులు తెంటు రవిబాబు ఆధ్వర్యంలో సమావేశం నిర్వహించారు. బొబ్బిలిలో పదో తేదిన జరిగే సభకు కార్యకర్తలు, నాయకులు కదలిరావాలని కోరారు. విలేకర్ల సమావేశంలో కొప్పల వెలమ బిసి సాధికారత విజయనగరం పార్లమెంటరీ కన్వీనర్ కొల్లి అప్పలనాయుడు, ఎంపిటిసి పాలవలస గౌరు మాట్లాడుతూ సభను విజయవంత చేయాలని కోరారు.

బకాయిలు తక్షణమే చెల్లించాలి

బొబ్బిలి: ప్రభుత్వ ఉద్యోగులు, ఉపాధ్యాయులు, పింఛనదారులకు చెల్లించాల్సిన బకాయిలు తక్షణమే చెల్లించాలని ఎపిటిఎఫ్ జిల్లా నాయకులు జెసి రాజు డిమాండ్ చేశారు. స్థానిక ఎన్‌జిఒ హోమ్‌లో ఆదివారం జిల్లా గౌరవాధ్యక్షులు బి.జోగినాయుడు అధ్యక్షతన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉపాధ్యాయులు, ఉద్యోగులు, పింఛనదారులకు 187 నెలల కరువు భత్యం బకాయి రూ.15వేల కోట్లు, పిఎఫ్, ఎపిజిఎల్ఐసి, సరెండర్ లీవ్, సిపిఎస్, పిఆర్‌సి బకాయిలు 17వేల కోట్లు చెల్లించాల్సి ఉన్నప్పటికీ చెల్లించకపోవడం అన్యాయమన్నారు. తక్షణమే బకాయిలు చెల్లించకపోతే పోరాటం చేస్తామని హెచ్చరించారు. ఈ సమావేశంలో ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

కుళాయి పనులకు శంకుస్థాపన

భోగాపురం: మండలంలోని పోలిపల్లి గ్రామంలో ఇంటింటి కుళాయిలకు సర్పంచ్ కర్రోతు వెంకటరమణ ఆదివారం శంకుస్థాపన చేశారు. జలజీవన్ మిషన్ కార్యక్రమంలో భాగంగా మొదటి విడత కింద ఈ గ్రామానికి సుమారు రూ.80 లక్షల మంజూరయ్యాయి. దీంతో పనులను ప్రారంభించేందుకు శంకుస్థాపన చేశారు. సచివాలయ కన్వీనర్ పతివాడ రామకృష్ణ, ఉప సర్పంచ్ కర్రోతు రాజశేఖర్, నాయకులు కర్రోతు బంగార్రాజు, శంకర్, శ్రీనివాసరావు, చింతపల్లి నారాయణప్పడు తదితరులు పాల్గొన్నారు.

పూర్వ విద్యార్థుల అపూర్వ కలయిక

వేపాడ: స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 1980 నుంచి 84 వరకూ చదువుకున్న పూర్వ విద్యార్థులు ఆదివారం బ్రహ్మ లింగేశ్వర ఆలయ వద్ద కలుసుకున్నారు. ఏటా జనవరిలో పూర్వ విద్యార్థులంతా కలుసుకుని సందడి చేస్తుంటారు. ఇందులో భాగంగానే ఈ ఏడాది కూడా ఆటపాటలతో ఆనాటి పరిచయాలను గుర్తు చేసుకుని విందు కార్యక్రమంలో పాల్గొని సందడి చేశారు.

ప్రభుత్వ స్థలాలు ఆక్రమిస్తే కఠిన చర్యలు

బొబ్బిలి: ప్రభుత్వ స్థలాలు ఆక్రమిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని తహశీల్దార్ డోల రాజేశ్వరరావు అన్నారు. పట్టణంలోని మల్లమ్మపేటలో ఆక్రమణకు గురైన స్థలాన్ని గుర్తించి ఆదివారం హెచ్చరిక బోర్డు ఏర్పాటు చేశారు. మల్లమ్మపేట రెవెన్యూ సర్వే నెంబర్ 242-6లో కాలువపోరంబోకు వుండడం ఆక్రమించేందుకు కొంతమంది ప్రయత్నించగా విఆర్ఒ గుర్తించి తహశీల్దార్‌కు సమాచారం ఇవ్వడంతో ఆయన ఆదేశాలు మేరకు ఆర్ఐ కళ్యాణ్ చక్రవర్తి ఆక్రమణకు గురైన బండలో బోర్డు ఏర్పాటు చేశారు. చెరువులు, ప్రభుత్వ స్థలాలు ఆక్రమిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని తహశీల్దార్ హెచ్చరించారు. ప్రభుత్వ స్థలాలు, చెరువులు ఆక్రమణకు గురికాకుండా కాపాడేందుకు ప్రజలు సహకరించాలని కోరారు.

ఎస్‌సి కాలనీలో 'భవిష్యత్తుకు గ్యారెంటీ'

శృంగవరపుకోట: పట్టణంలోని ఎస్‌సి కాలనీలో వార్డు మెంబర్ ఆకెళ్ల చెల్లయ్య ఆధ్వర్యంలో ఆదివారం బాబు ష్యూరిటీ భవిష్యత్తుకు గ్యారెంటీ కార్యక్రమాన్ని నిర్వహించారు. నియోజకవర్గ టిడిపి ఇంఛార్జ్ కోళ్ల లలిత కుమారి ఆదేశాల మేరకు బాబు ష్యూరిటీ కరపత్రాలను పంపిణీ చేశారు. మినీ మేనిఫెస్టో పథకాల గురించి వివరించారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

బాడంగి: యువత భవిష్యత్తు టిడిపితోనే సాధ్యమని టిడిపి విజయనగరం పార్లమెంటరీ అధికార ప్రతినిధి ఆర్పెల్లి రాంప్రసాద్ అన్నారు. మండలంలోని వాడాడలో ఆదివారం బాబు ష్యూరిటీ భవిష్యత్తుకు గ్యారెంటీ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వైసిపి ప్రభుత్వం నిరుద్యోగులను నమ్మించి గొంతు కోసిందన్నారు. ఏటా జాబ్ కేలండర్ అని చెప్పి నిరుద్యోగులను మోసం చేసిందన్నారు. కార్యక్రమంలో జనసేన నాయకులు పాల్గొన్నారు.

ఒంటరి వృద్ధులకు నిత్యావసరాలు

కొత్తవలస: మండల కేంద్రంలోని తుమ్మికాపల్లిలో ఫర్ ది పీపుల్ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో 42 మంది ఒంటరి వృద్ధులకు ఆదివారం 12 రకాల నిత్యావసర సరుకులు, అన్నదానం, వస్త్రదానం చేశారు. డిప్యూటీ తహశీల్దార్ రమేష్, విజయలక్ష్మి ఎంటర్ ప్రైజెస్ మూర్తి, గోపి, ట్రస్ట్ సభ్యుల ఆర్థిక సహకారంతో ఈ కార్యక్రమాన్ని నిర్వహించినట్లు ట్రస్ట్ ఛైర్మన్ విశ్వనాథ హరికుమార్ తెలిపారు. డిప్యూటీ తహశీల్దార్ రమేష్ మాట్లాడుతూ ట్రస్టులో హరి చేస్తున్న సేవలు అభినందనీయమన్నారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు ఈశ్వరరావు, రవి, రైల్వే రిటైర్డ్ ఎంప్లాయ్ రమణ, సెక్రెటరీ ప్రవీణ్ కుమార్, జాయింట్ సెక్రెటరీ రవి, ట్రెజరర్ శ్రావణ్ కుమార్, సభ్యులు నరేష్, ఈశ్వరరావు, గోవిందరావు, గణేష్ తదితరులు పాల్గొన్నారు.

సాంస్కృతిక పోటీలకు ఆహ్వానం

రామభద్రపురం: సంక్రాంతి పండుగ సందర్భంగా స్వర్గ భారతి ఫౌండేషన్ ఆధ్వర్యంలో, శ్రీ శేషులు బెంను భారతమ్మ జ్ఞాపకార్థం ఈ నెల 10న సాంస్కృతిక పోటీలు, కోలాటం బాడంగి మండలం కోడూరు గ్రామంలో నిర్వహించనున్నట్లు ఆర్గనైజర్ గేదెల కరుణ కుమార్, తెంటు సత్యం, సింహాచలం ఒక ప్రకటనలో తెలిపారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయం ఆవరణలో వారు ఈ పోటీలకు సంబందించిన కరపత్రాన్ని ఆదివారం విడుదల చేశారు. ఆ రోజు ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు కోలాటం పోటీలు ప్రదర్శన ఉంటుందన్నారు. ఈ పోటీలు స్థానిక ఎమ్మెల్యే ఎస్‌వి చినప్పలనాయుడు ప్రారంభిస్తారని, ముఖ్య అతిథిగా జెడ్‌పి చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు హాజరవుతారని తెలిపారు. 30 కిలోమీటర్ల పైబడి వచ్చిన టీములకు ట్రావెలింగ్ ఖర్చులు ఇస్తామన్నారు. ప్రతి టీమ్‌కు బోజన సదుపాయం కల్పిస్తామన్నారు. గెలుపొందిన టీములకు మొదటి బహుమతిగా రూ. 15వేలు, రెండో బహుమతిగా రూ. 10వేలు, మూడవ బహుమతిగా రూ.5వేలుతో పాటు షీల్డు కూడా బహుక రిస్తామన్నారు.

గ్రంథాలయంలో 'చదవడం మాకిష్టం'

డెంకాడ: స్థానిక శాఖా గ్రంథాలయంలో ఆదివారం చదవడం మాకిష్టం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా హాజరైన విద్యార్థులకు వారికి నచ్చిన కథల పుస్తకాలు చదివించారు. పరమానందయ్య శిష్యుల, బాల మిత్ర, బాల భారతం, బాల రామాయణం మొదలగు కథల పుస్తకాలు చదివారు. అనంతరం విద్యార్థులకు బిస్కట్లు పంచి ప్రతి ఆదివారం తప్పనిసరిగా చదువంటే మాకు ఇష్టం కార్యక్రమానికి హాజరు కావాలని లైబ్రేరియన్ మహేశ్ విద్యార్థులకు చెప్పారు.

నిర్మాణాలు పూర్తి చేయకపోతే నిరాహార దీక్ష

బొబ్బిలి: స్థానిక శాఖ గ్రంథాలయ భవనం మరమ్మతు పనులు పూర్తి చేయకపోతే నిరాహారదీక్ష చేస్తామని జనసేన రాష్ట్ర ప్రచార కార్యదర్శి బాబు పాలూరి అన్నారు. జనసేన కార్యాలయంలో ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ గ్రంథాలయ భవనాన్ని బాగు చేస్తామని ఎమ్మెల్యే హామీ ఇచ్చి మున్సిపల్ నిధులు కేటాయించినప్పటికీ పనులు పూర్తి చేయకపోవడం దుర్మార్గమన్నారు. గ్రంథాలయం పనులు పూర్తి చేయకపోవడంతో పాఠకులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. గ్రంథాలయ భవనంపై జనసేన పోరాటం చేస్తే రెండు వారాల్లో పనులు పూర్తి చేస్తామని హామీ ఇచ్చినప్పటికీ నెలలు గడుస్తున్నా పనులు పూర్తి చేయకపోవడం అన్యాయమన్నారు. ఈనెల 24లోగా పనులు పూర్తి చేయకపోతే నిరాహారదీక్ష చేస్తామన్నారు. ఆయనతో జనసేన నాయకులు ఉన్నారు.


సావిత్రిబాయి పూలే జయంతిని

జాతీయ మహిళా ఉపాధ్యాయ దినోత్సవంగా ప్రకటించాలి

- యుటిఎఫ్ రాష్ట్ర నాయకులు విజయగౌరి

ప్రజాశక్తి - బొబ్బిలిరూరల్

సావిత్రి బాయి పూలే జన్మదినం జనవరి 3న జాతీయ మహిళా ఉపాధ్యాయ దినోత్సవంగా కేంద్రం ప్రభుత్వం ప్రకటించాలని యుటిఎఫ్ రాష్ట్ర నాయకులు విజయగౌరి డిమాండ్ చేశారు. ఆదివారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో సావిత్రి బాయి పూలే జయంతి కార్యక్రమాలు యూటీఎఫ్ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని జిల్లా కార్యదర్శి, మహిళా సబ్ కమిటీ కన్వీనర్ వి.రాధాభవానీ అధ్యక్షతన నిర్వహించారు. విజయగౌరి మాట్లాడుతూ దేశం గర్వించదగ్గ తొలి మహిళా టీచర్ సావిత్రి బాయి అని, ఆమె ఆశయాలను అమలు చేయడం ప్రధాన కర్తవ్యమని అన్నారు. బడి పిల్లలను ప్రేమించాలని, చదువుతో పాటు సమాజ చైతన్యాన్ని నింపాలని చెప్పిన కార్యసాధకురాలు సావిత్రి బాయి పూలే అని గుర్తు చేశారు. ప్రధానంగా ఈ సమావేశంలో నూతన విద్యా విధానాన్ని అమలు చేసి బడులను మూసి, ప్రైవేటీకరణకు దోహదం పెడుతున్న పాలకులు విధానాలు సావిత్రి బాయి ఆశయాలకు విఘాతకం అని అన్నారు. ఆమె పూనే లో ఏర్పాటు చేసిన ఆనాటి బాలికల పాఠశాలలు శిథిలావస్థలో ఉన్నాయని వాటిని పున్న నిర్మించి ఒక చారిత్రక అంశంగా సజీవం చేయాలని, దీనిలో ప్రభుత్వాలు జోక్యం చేసుకోవాలని కోరారు. యుటిఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి జె. ఈశ్వరరావు మాట్లాడుతూ సావిత్రి బాయి పూలే ఒక సామాజిక ఉద్యమకారిణి అని, నూతన విధానాన్ని రద్దు చేయించడమే నేటి విద్యా రంగం పరిరక్షణకు మలుపు అని అన్నారు. ఎంపిడిఒ రవికుమార్ మాట్లాడుతూ సావిత్రి బాయి పూలే అందరికీ ఆదర్శనీయురాలని అన్నారు. విజయనగరం, పార్వతీపురం మన్యం జిల్లాల రాష్ట్ర కౌన్సిలర్లు జి.పద్మావతి, ఐ.రాజామణి, ఎస్.రాజకుమారి, వి.జ్యోతిలు మాట్లాడుతూ మహిళా టీచర్లు విద్యారంగంలో కీలక పాత్ర పోషించాలని పిలుపు నిచ్చారు. జిల్లా సహాధ్యక్షులు ప్రసన్నకుమార్ జిల్లా కార్యదర్శి కె.శ్రీదేవి చదువుతో పాటు నేటి సామాజిక అంశాలను విద్యార్థులకు తెలియచేసి చైతన్యాన్ని పెంచే భాద్యత మనదే అన్నారు. అనంతరం సావిత్రి బాయి పూలే జయంతిని జాతీయ మహిళా టీచర్ల దినోత్సవంగా కేంద్ర ప్రభుత్వం ప్రకటించాలని, ఆమె జీవితం చరిత్రను పై స్థాయి వరకు పాఠ్యాంశంగా చేర్చాలని, ఆమె మొదటిసారిగా పూనేలో నిర్మించిన బాలికల పాఠశాలలు శిధిలావస్థలో ఉన్న కారణంగా వాటిని పున్న నిర్మాణం చేసి ఒక చారిత్రిక అంశంగా చూపాలని, పూలే ఆశయాలకు తిలోదకాలిచ్చే నూతన విద్యా విధానాన్ని రద్దు చేయాలని సభ తీర్మానాలను ప్రవేశపెట్టింది. అనంతరం సభ ఏకగ్రీవంగా ఆమోదించింది. ఈ సందర్భంగా రామభద్రపురం హైస్కూల్, ఎలిమెంటరీ పూడి వీధి విద్యార్థులు సావిత్రి బాయి పూలే పై రచించిన సాంస్కృతిక కార్యక్రమాలు ప్రదర్శించి ఆకట్టుకున్నారు. పాఠశాలలో పరిరక్షణ, మహిళా టీచర్ల పాత్ర అనే అంశం పై జరిగిన వ్యాసరచన పోటీలో గెలుపొందిన మహిళా టీచర్లు లావణ్య, శ్రీదేవి, లక్ష్మిలకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో బొబ్బిలి, రామభద్రపురం మండలాల యుటిఎఫ్ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు శ్రీనివాస్, శంకరరావు, సుధాకర్, చంటి, స్వామినాయుడు, రామకృష్ణలతో పాటు మహిళా నాయకులు, కార్యకర్తలు, మహిళా టీచర్లు పాల్గొన్నారు.



సావిత్రి బాయి పూలే చిత్ర పటం వద్ద నివాళులర్పిస్తున్న ఉపాధ్యాయులు

మహిళా రైతుకు 33 సెంట్లు అప్పగింత

- పరిహారం అందుకున్న రైతు భూమిలోని నుంచి సేకరణ
- శిరోమణికి న్యాయం చేసేందుకు చర్యలు
- ఆన్‌లైన్ చేసి ఇవ్వాలంటున్న మహిళా రైతు

ప్రజాశక్తి - భోగాపురం

భోగాపురం గ్రామానికి చెందిన మహిళా రైతుకు న్యాయం చేసేందుకు రెవెన్యూ అధికారులు చర్యలు ప్రారంభించారు. దీనిలో భాగంగా ఇటీవలి 33సెంట్లు భూమికి కొలతలు వేసి హద్దులు చూపించామని అధికారులు చెబుతున్నారు. విమానాశ్రయానికి వెళ్లేందుకు రహదారి కోసం 2017లో భూసేకరణ చేశారు. భోగాపురం గ్రామానికి చెందిన మహిళా రైతు మాత శిరోమణికి చెందిన 27సెంట్లు భూమికి అప్పట్లో పరిహారం అందజేశారు. ఇటీవలి జీఎమ్మాఆర్ సంస్థకు రెవెన్యూ అధికారులు ఈ భూమిని అప్పగించారు. అయితే జిఎంఆర్ సంస్థ పరిహారం ఇచ్చిన భూమితో పాటు మరో 40 సెంట్లు భూమిలో నుంచి కొత్తగా సరిహద్దు రాళ్లు వేశారు. దీంతో ఆ మహిళా రైతు సుమారు కోటి రూపాయలు విలువైన 40 సెంట్లు భూమి కోల్పోవలసి వస్తుంది. ఈ నేపథ్యంలో పరిహారం కోసం అధికారులు చుట్టూ తిరిగినప్పటికి స్పందించలేదు. ఇటీవలి ప్రజాశక్తిలో అధికారుల తప్పిదం రైతుకు శాపం అనే ప్రత్యేక కథనం వెలువడడంతో అధికారులు స్పందించారు. 2017లో భూసేకరణ చేసేటప్పుడు మహిళా రైతు పక్కనున్న మరో రైతుకు నష్ట పరిహారం వేసినట్లు గుర్తించారు. సంబంధిత రైతుకు విచారణకు రావాలని రెవెన్యూ అధికారులు పలుమార్లు నోటీసులు ఇచ్చినప్పటికి నేరుగా చెప్పినప్పటికి హాజరు కాలేదని అధికారులు చెబుతున్నారు. దీంతో ఆగ్రహించిన జిల్లా అధికారులు స్థానిక అధికారులతో పాటు సర్వేర్లను పంపించి సంబంధిత రైతు భూమిలో ఇటీవలి కొలతలు వేశారు. 33సెంట్లు భూమికి కొల తలు వేసి మహిళా రైతుకు హద్దులు చూపించారు. అయితే ఇంకా అధికారకంగా ఉత్తర్వులు ఇవ్వలేదని మహిళా రైతు చెబుతున్నారు. అధికారులు ఆన్‌లైన్ చేసి ఇవ్వాలని ఆమె కోరుతున్నారు.



సర్వే చేస్తున్న రెవెన్యూ అధికారులు

భూమి అప్పజెప్పాం

నష్టపరిహారం మరో రైతుకు పడినట్లు గుర్తించాం. దీనిపై సంబంధిత రైతుకు నోటీసులు ఇచ్చి హాజరుకావాలని తెలిపాం. కాని సంబంధిత రైతు హాజరుకాలేదు. దీనితో ఉన్నతాధికారుల సూచనల మేరకు ఆ రైతుకు చెందిన భూమికి కొలతలు వేసి మహిళా రైతుకు 33సెంట్లు అప్పజెప్పాం మ్యుటేషన్ కోసం దరఖాస్తు చేస్తే మహిళా రైతు పేరు మీద ఆన్‌లైన్ చేస్తాం.

– చింతాడ బంగార్రాజు, తహశీల్దారు, భోగాపురం

పింఛన్ల పంపిణీలో ప్రచారంపై విమర్శలు

ప్రజాశక్తి- వేపాడ

మండలంలో ఆదివారం బల్లంకి, అరిగిపాలెం, కరకవలస గ్రామాల్లో వైసిపి స్థానిక నాయకులు పింఛన్లను పంపిణీ చేశారు. అయితే పింఛన్లను పంపిణీ చేస్తున్న నాయకులు గ్రామాల్లో తిరుగుతూ పింఛన్లను జగన్ పెంచారని ఈ సారి ఆయనకే తప్పనిసరిగా ఓటు వేయాలని చంద్రబాబును గెలిపిస్తే పింఛన్లను నిలిపేస్తామని బెదిరిసున్నారు. దీనిపై పింఛన్లర్లు విమర్శలు గుప్పిస్తున్నారు. పింఛన్ల సొమ్ము జగన్మోహన్‌రెడ్డి ఇంట్లోనివి కాదని ప్రజల నుంచి వచ్చి వసూలు చేసిన పన్నులనే పింఛన్లగా ఇస్తున్నారన్న విషయాన్ని వైసిపి నాయకులు గమనించాలని బహిరంగంగానే విమర్శిస్తున్నారు. ఇలాంటి ప్రచారాలు మానుకోవాలని హితువు పలికారు. ఈ కార్యక్రమంలో బల్లంకి కనకరాజు, కరకవలస ఉప సర్పంచ్ డి. అప్పన్న, అరిగిపాలం నాయకుడు డి సన్యాసిరావు గ్రామ వాలంటీర్లు పాల్గొన్నారు.

అందరికీ సేవాభావం ఉండాలి

ప్రజాశక్తి - పూసపాటిరేగ

ప్రజలందరికి సేవాబావం ఉండాలని బిజెపి ఎంపి జివిఎల్ నరసింహరావు, మాజీ ఎమ్మెల్యే పతివాడ నారాయణ స్వామి నాయుడు అన్నారు. ఆదివారం స్థానిక సాయికృష్ణ దియేటర్ వద్ద మదురా పౌండేషన్ రెల్లివలస వారి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఉచిత మెగా వైద్యశిభిరాన్ని వారు ప్రారంబించారు. ఈ వైద్య శిభిరంలో సుమారుగా 1000 మంది రోగులుకు తనికీలు చేసి ఉచితంగా మందులు అందజేశారు. కాన్వీ హస్పటల్ ఎమ్‌డి, ఆర్థోపెడిక్ వైద్యులు మోపాడ ప్రవీణ్‌కుమార్, జనరల్ సర్జన్ డాక్టర్ మహంతి శ్రీనువాసరావుతో పాటు పిడియాట్రిక్స్, న్యూరాలజీ, కార్డియాలజి తదితర వైద్యులు హజ్జరై రోగులును పరీక్షించారు. ఈ సందర్బంగా పౌండేషన్ ఆర్గనైజర్ మహంతి అరుణకుమారి మాట్లాడుతూ సేవాబావంతోనే ఈ పౌండేషన్ ప్రారంబించా మన్నారు. పౌండేషన్ స్థాపకులు మహంతి శ్వేతసాయికుమారి గ్రామీణ ప్రాంతాల్లో పేద, బడుగు, బలహీన వర్గాల వారికి సహాయంగా ఉండాలన్న ఉద్దేశంతో స్థాపించారన్నారు. అనంతరం వైద్య శిబిరానికి హాజరైన 700 మంది రోగులకు దుప్పట్లు, ఆహార పొట్లాలు పంపిణీ చేశారు. ఈ శిబిరంలో మాజీ ఎంపిపిలు మహంతి చిన్నంనాయుడు, కంది చంద్రశేఖర్, టిడిపి మండల అధ్యక్షులు మహంతి శంకరావు, నాయకులు ఆకిరి ప్రసాదరావు, పతివాడ అప్పలనాయుడు, పిన్నింటి సన్యాసినాయుడు, బ్రాహ్మణ సాధికారి సమితి జిల్లా అధ్యక్షులు ఐ. రాకేష్‌శర్మ తదితరులు పాల్గొన్నారు.



దుప్పట్లను పంపిణీ చేస్తున్న మాజీ మంత్రి పతివాడ, వైద్యులు

నైపుణ్య విద్యలో ముందంజ

ప్రజాశక్తి - నెల్లిమర్ల

విద్యార్థులకు నైపుణ్య విద్యను అందించడంలో సెంచూరియన్ విశ్వవిద్యాలయం ముందంజలో ఉందని లార్సెన్ అండ్ టోబ్రో చీఫ్ సస్టయినబిలిటీ ఆఫీసర్ డాక్టర్ పణీష్‌రావు అన్నారు. ఇటీవల సెంచూరియన్ విశ్వవిద్యాలయం వైస్ ప్రెసిడెంట్ ప్రొఫెసర్ డి.ఎన్.రావు, ఛాన్సలర్ ప్రొఫెసర్ జిఎస్ఎన్ రాజు చేతుల మీదుగా ఆయనకు గౌరవ డాక్టరేట్ ప్రధానం చేసిన విషయం విధితమే. ఈ సందర్భంగా తనను కలసిన విలేఖరులతో ఆయన మాట్లాడుతూ విద్యార్థులు ఉన్నత శిఖరాలను అధిరోహించాలంటే మల్టీ టాస్క్ చేయగల నేర్పును సాధించాలన్నారు. అవరోధాలను కూడా పాజిటివ్ దృక్పథంలో స్వీకరించి ముందుకు సాగినపుడు విజయాలు వాటంతట అవే సమకూరుతాయన్నారు. తాను కూడా అదే దృక్పథంతో ముందుకు వెళ్తున్నానని గుర్తు చేశారు. దివాలా తీసిన వాటిని కూడా లాభాల భాట పట్టించానని గుర్తు చేశారు. విద్యార్థులు ప్రపంచ పరిణామాల వల్ల ఎదురయ్యే సవాళ్లను కూడా స్వీకరించ గల సమర్థత కలిగి ఉండాలన్నారు. ఆ విధంగా తమ లక్ష్యాలను చేరుకునేందుకు పట్టుదలతో కృషి చేస్తే విజయం మీ వెంటే ఉంటుందని చెప్పారు.



డాక్టరేట్‌ను ప్రదానం చేస్తున్న ఛాన్సలర్ రాజు

డెల్టా ప్రతిభా పోటీల్లో విద్యార్థుల సత్తా

ప్రజాశక్తి- బొబ్బిలి

రాష్ట్ర ఆంగ్లభాష ఉపాధ్యాయుల సంఘం (డెల్టా) ఆధ్వర్యంలో పదో తరగతి విద్యార్థులకు ఆంగ్ల భాష పాఠ్యాంశాలపై ప్రతిభాపాటవ పోటీలను ఆదివారం కళాభారతి ఆడిటోరియంలో అధ్యక్షుడు యం. విజయ మోహన్‌రావు నిర్వహించారు. బలిజిపేట గవర్నమెంట్ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ ఎం.జ్యోతి మాట్లాడుతూ ప్రతి విద్యార్థి చిన్నప్పటి నుంచే పోటీ పరీక్షలకు వెళ్లడం అలవాటు చేసుకోవాలన్నారు. తద్వారా భవిష్యత్తులో మెరుగైన అవకాశాలు లభిస్తాయన్నారు. 13 సంవత్సరాలుగా డెల్టా పోటీ పరీక్షల్లో పాల్గొన్న వందలాది మంది ప్రతిభావంతులైన విద్యార్థులు ఉన్నత స్థానాల్లో స్థిరపడ్డారని గుర్తు చేశారు. ఆంగ్ల భాష మధ్యామం సాధించిన వారికి మంచి ఉద్యోగ అవకాశాలు ఉన్నాయని తెలిపారు. ఈ పోటీల్లో విజయనగరం, పార్వతీపురం, శ్రీకాకుళం జిల్లాల నుండి ప్రభుత్వ పాఠశాలలకు చెందిన 232 మంది విద్యార్థులు పాల్గొనడం అభినందనీయమని చెప్పారు. తరువాత ఆమె డెల్టా సభ్యులతో కలసి పోటీ పరీక్షల పత్రాలను విడుదల చేశారు. విజేతలుగా నిలిచిన వారికి నగదు బహుమతులు అందించారు. ఈ కార్యక్రమంలో డెల్టా సభ్యులు మింది గుంప స్వామి, సిహెచ్ రవి, కర్రి సత్యనారాయణ, బిహెచ్ గంగాధర్, సిహెచ్ అప్పలనాయుడు, పళ్ళ సత్యనారాయణ, ఎం సుగుణ, జి. కల్యాణి, బి. లక్ష్మి, బి.పరమేష్, కె.గంగాధర్, ఈ మహేష్, ఎస్. ఝాన్సీ లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

యువత సేవా కార్యక్రమాలు చేపట్టాలి

ప్రజాశక్తి - నెల్లిమర్ల

యువత స్వచ్ఛంద సేవా కార్యక్రమాలు చేపట్టాలని పలువురు కోరారు. ఆదివారం నగర పంచాయతీ పరిధి జరజాపుపేటలో సాధన యువజన సంఘం ఆధ్వర్యంలో స్వచ్ఛంద రక్తదాన శిబిరం నిర్వహించారు. ఈ శిబిరానికి జిల్లా సర్వే సహాయ సంచాలకులు టి.త్రివిక్రమ్ రావు లాంఛనంగా ప్రారంభించారు. జిల్లా సర్వే సంఘం అధ్యక్షులు చౌదరి వెంకటరావు, జిల్లా సర్వే సంఘం ట్రెజరర్ నరేష్ రెడ్డి పాల్గొని మాట్లాడారు. యువత స్వచ్ఛందంగా ఇలాంటి సేవా కార్యక్రమాలు చేయడం గొప్ప పరిణామమన్నారు. శిబిరంలో జరజాపుపేట యువత స్వచ్ఛందంగా 30మంది రక్తదానం చేశారు. విజయనగరం ఎన్‌విఎన్ బ్లడ్ బ్యాంక్ పాల్గొని రక్త సేకరణ చేశారు. ఈ కార్యక్రమంలో మిమ్స్ హెచ్ ఆర్ ఆరిపాక శ్రీనివాసరావు, మెరక ముడిదాం ఎంఇఒ మాత చంద్ర శేఖర్, సాధన అధ్యక్షులు పోలుబోతు దుర్గాప్రసాద్, ఉపాధ్యక్షులు బెల్లాన వెంకటరావు, ప్రధాన కార్యదర్శి పసుమర్తి వెంకటరమణ, సభ్యులు తుమ్ము అశోక్, కనకల సురేంద్ర, హరి రాజారావు, కె. రాంబాబు, ఎం. రాంబాబు, పి హరికృష్ణ, డి.పూర్ణ చంద్ర, ఉపాధ్యాయులు మద్దిల సత్యనారాయణ, మద్దిల సూరిబాబు, మద్దిల శేఖర్, మాజీ సైనికులు సముద్రపు సత్తిబాబు, సముద్రపు శంకర్, కల్యాణ్ చక్రవర్తి, ఎస్ .శ్రీనివాసరావు, యువత కాళ్ల వాసు, బి.బలరాం, ఎం.యుగంధర్, ఎన్‌విఎన్ బ్లడ్‌బ్యాంకు ఇంఛార్జి నాగేశ్వర రావు, స్టాఫ్ మాళవిక, కల్యాణ్, విజయ్, పాల్గొన్నారు.

భూసమస్యలు పరిష్కరించాలి

ప్రజాశక్తి- మెంటాడ

మండలంలోని ఆంద్ర, లోతుగెడ్డ, వంకసోమిద, కొండలింగాల వలస, కూనేరు, ఉద్దంగి, జిటిపేట, పెదమేడపల్లి, జయతి, వాణిజ, పులిగుమ్మి, పోరాంలోవ, జక్కువ, మెంటాడ గ్రామాల గిరిజనులు, గిరిజనేతరులు తరతరాలుగా డొంకలు, తుప్పులు నరికి సాగుచేస్తున్న భూములలో జీడి, మామిడి తోటలు పెంపకం చేపట్టి ఫలసాయం పొందుతున్నారు. సాగుచేస్తున్న భూములకు పట్టాలు ఇవ్వాలని ఆదివారం పిట్టాడలో గిరిజనలు, సిపిఎం నాయకులు ఎంపిపి రెడ్డి సన్యాసినాయుడుకు అతని నివాసంలో కలిసి వినతిపత్రం అందజేశారు. భూములు తమ సాగులోవున్నా రైతుభరోసా, బ్యాంకు రుణాలు లింక్ రాయితీలు ఇతరత్రా సదుపాయాలకు దూరం అవుతున్నామని చెప్పారు. ఈ సమస్యలపై పలుమార్లు రాష్ట్ర ఉపముఖ్యమంత్రి పీడిక రాజన్నదొరకు, జిల్లా కలెక్టర్‌కు, ఆర్‌డిఒ, ఇతర అదికారులకు, ప్రజాప్రతినిధులకు విన్నవించుకున్నా ఫలితం లేదన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఎం మండల కార్యదర్శి రాకోటి రాములు, గిరిజన సంఘం మండల కార్యదర్శి తామారాపల్లి సోములు, పి సింహాచలం, టి గాంధీ, ఎస్ గంగరాజు తదితరులు పాల్గొన్నారు.

కోడి పందేలపై దాడి..13 మంది అరెస్టు

ప్రజాశక్తి- బొబ్బిలి

మండలంలోని వాకాడవలస శివారులో అమ్మవారి ఆలయం వద్ద కోడి పందాలపై పోలీసులు ఆదివారం దాడి చేసి 13మందిని అరెస్టు చేశారు. వారి వద్ద నుంచి రూ. 31,260 నగదు, 15కోడి పుంజలను స్వాధీనం చేసుకున్నారు. కోడి పందాలు నిర్వహిస్తున్నట్లు పోలీసులకు సమాచారం పట్టుకున్నట్లు ఎస్ఐ జ్ఞానప్రసాద్ చెప్పారు. **భోగాపురం:** మండలంలోని లింగాల వలస గ్రామ శివారులో కోడిపందాల శిబిరంపై పోలీసులు ఆదివారం దాడి చేశారు. కోడిపందాలు జరుగుతున్నట్లు పోలీసులకు సమాచారం రావడంతో ఎస్ఐ కృష్ణమూర్తి సిబ్బందితో వెళ్లి పట్టుకున్నారు. ఏడుగురు వ్యక్తులతో పాటు రెండు కోళ్లు, 15వేలు నగదును స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు.

రేగిడి: మండలంలోని ఉణుకూరు గ్రామానికి చెందిన ఓ వ్యక్తి బెల్ట్‌షాపు నడపడంతో 35 మద్యం బాటిళ్లతో పోలీసులకు ఆదివారం పట్టుబడ్డాడు. ఉంగరాడ మెట్ట నుంచి ఉణుకూరు స్వగ్రామానికి అక్రమంగా 35 మద్యం బాటిళ్లు తీసుకువెళ్ళడంతో పోలీసులు దాడులు జరిపారు. ఈ దాడుల్లో అక్రమ మద్యం స్వాధీనం చేసుకుని రేగిడి పోలీస్ స్టేషన్ తరలించినట్లు ఎస్ఐ శ్రీనివాసరావు తెలిపారు. ఆయనతో పాటు పోలీసులు శివ, సుధీర్ తదితరులు పాల్గొన్నారు. **వేపాడ:** మండలంలోని కొండగంగుపూడిలో అనుమతులు లేకుండా మద్యం అమ్ముతున్నట్లు గ్రామస్తుల ఇచ్చిన సమాచారం మేరకు వల్లంపూడి ఎస్ఐ రాజేష్ తన సిబ్బంది కలిసి ఆదివారం దాడులు చేశారు. ఈ దాడిలో 25 మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకుని ఒక వ్యక్తిని అరెస్టు చేశారు.

గ్రామాభివృద్ధే ధ్యేయం

గుర్ల: గ్రామాభివృద్దే ధ్యేయమని అభివృద్ధికి అధిక ప్రాధాన్యత ఇస్తున్నామని సర్పంచ్ పొట్నూరు కనకమ్మ, వైసిపి జిల్లా కార్యవర్గ సభ్యులు పొట్నూరు సన్యాసినాయుడు అన్నారు. ఆదివారం పాలవలసలో రూ.3 లక్షలతో నిర్మించిన సీసీ డ్రైనే కాలువలు, సీసీ రోడ్లను వారు ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రతి వీధిలో సీసీ కాలువలు, సీసీ రోడ్లు వేశామన్నారు. గ్రామాభివృద్ధికి అందరూ సహకరించాలని కోరారు. మరికొద్ది రోజుల్లో గ్రామంలో సచివాలయం, వైయస్సార్ క్లినిక్, ఇంటింటి కుళాయిలు, మిగతా అభివృద్ధి పనులు ప్రారంభిస్తామన్నారు. ఉప సర్పంచ్ వి.రాము, సచివాలయం కన్వీనర్ బూర్లె శ్రీనివాసరావు, రామనాయుడు, అచ్చంనాయుడు, అప్పలనాయుడు పాల్గొన్నారు.

వైసిపికి రోజులు దగ్గర పడ్డాయి: మాజీ మంత్రి

ప్రజాశక్తి- రేగిడి

రాష్ట్ర ముఖ్యమంత్రి సైకో జగన్మోహన్ రెడ్డి పార్టీకి రోజులు దగ్గర పడ్డాయని, అందుకు ప్రజలు ఎన్నికలు ఎప్పుడు వస్తాయా అని ఎదురు చూస్తున్నారని మాజీ మంత్రి కోండ్రు మురళీమోహన్ విమర్శించారు. ఈ మేరకు ఆదివారం పనసలవలస గ్రామ సర్పంచ్ గేదెల ధనలక్ష్మితో పాటు గేదెల గోవిందరావు, కడగల జోగినాయుడు, నర్సు నాయుడు, సత్యనారాయణ, గోపాలకృష్ణ, అప్పల నాయుడు, రామకృష్ణ, సింహాచలం, మంతిని సూరినాయుడు మొత్తం 700 మంది వైసిపిని వీడి టిడిపిలో చేరారు. వీరికి కోండ్రు మురళీ పార్టీ కండువా వేసి తెదేపాలోకి సాదరంగా ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో టిడిపి మండల అధ్యక్షులు కిమిడి అశోక్ కుమార్, మాజీ డిసిసిబి చైర్మన్ దూబ ధర్మారావు, కర్నేన మహేష్, గురవాన నారాయణరావు, మంతిన ఉషారాణి, చల్లా భుజంగరావు, మజ్జి శ్రీను, నల్ల భాస్కరరావు, గణేష్, పాల్గొన్నారు.

డెంకాడ: మండలంలోని జొన్నాడ మాజీ ఎంపిటిసి అప్పలనాయుడు, గారి పాపు, గొలగాని గౌరీ, సంతోష్, గొలగాని రమేష్, నకెళ్ళ శ్రీను, గారి రమేష్, పడగల వెంకటేష్, పెనిమిటి అప్పన్న తదితరుల ఆదివారం వైసిపిని వీడి టిడిపిలో చేరారు. వీరికి ఎస్‌కోట మాజీ ఎమ్మెల్యే కోళ్ల లలితకుమారి, టిడిపి నెల్లిమర్ల నియోజకవర్గం ఇంచార్జి కర్రోతు బంగార్రాజు టిడిపి కండువాలు వేసి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో సీనియర్ నాయకులు కంది చంద్రశేఖర రావు, పతివాడ అప్పలనారాయణ, పల్లె భాస్కర్ రావు, కలిదిండి పాణిరాజు, పతివాడ శివరామ విద్య సాగర్ నాయుడు, త్రిపరగిరి అప్పారావు, కోరాడ రమేష్, సారిక నాగరాజు, త్రిపరగిరి శ్రీను, పాల్గొన్నారు.

గుర్ల: టిడిపితోనే అభివృద్ధి సాధ్యమని ఆ పార్టీ నియోజకవర్గం ఇంఛార్జి కిమిడి నాగార్జున అన్నారు. ఆదివారం గూడెం గ్రామంలో జరిగిన పార్టీలో చేరికల కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. గ్రామంలో వైసిపిని వీడి 50 కుటుంబాలు టిడిపిలో చేరాయి. వీరికి నాగార్జున పార్టీ కండువాలు వేసి ఆహ్వానించారు. గ్రామానికి చెందిన తోట పైడి నాయుడు, సూర్యానారాయణ, రమణ ఆధ్వర్యంలో రెడ్డి పోలి నాయుడు, పాపారావు, జమ్ము ముసిలినాయుడు, రెడ్డి రామారావు, సువ్వాడ అప్పల నాయుడు, తోట అక్కునాయుడు, పత్తిగిల్లి శివ, రెడ్డి శ్రీను, పిల్లా శ్రీను పార్టీలో చేరాఉ. టిడిపి రాష్ట్ర బిసి సెల్ ఆర్గనైజింగ్ సెక్రెటరీ వెన్నె సన్యాసినాయుడు అధ్యక్షత వహించిన టిడిపి మండల అధ్యక్షులు చనమల్ల మహేశ్వర రావు, నాయకులు తిరుములరాజు కిరణ్ కుమార్, కనిమేరక కృష్ణ, జి.రాము నాయుడు, పిల్లా అప్పలనాయుడు, నియోజకవర్గ ఐ టిడిపి అధ్యక్షులు నాగులపల్లి నారాయణరావు పాల్గొన్నారు.

తెర్లాం: మండలంలోని పెరుమాలి, టెక్కలి వలస గ్రామాల నుండి 100 కుటుంబాలు వైసిపిని వీడి టిడిపిలో చేరాయి. గ్రామ సర్పంచ్ ఎస్ హేమలత, భర్త అప్పల నరసింహారాజు ఆధ్వర్యంలో రెండు గ్రామాల నుండి వార్డు మెంబర్లు, ఉప సర్పంచ్ బసవ వెంకటరమణ, సాగిరాజు జగన్నాథరాజు, సాగిరాజు అప్పలరాజు, వేలగాడు కృష్ణలు ఆదివారం టిడిపి నియోజకవర్గ ఇన్‌ఛార్జి బేబినాయన, మాజీ ఎమ్మెల్యే తెంటు లక్ష్మునాయుడు సమక్షంలో పార్టీలో చేరారు. ఈ కార్యక్రమంలో టిడిపి మండల అధ్యక్షులు వెంకట నాయుడు, వెంకటేశ్వరరావు, జగ్గరాజు తదితరులు పాల్గొన్నారు.